# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన–4 జనవరి 5, 2015

హైదరాబాద్ నగరంలోని ప్రస్తుత జనాభా, కొద్ది సంవత్సరాలలోనే పెరిగే జనాభాను అంచనా వేసి అందరికి మంచినీళ్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగర మంచినీటి సరఫరాపై సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి యండి జగదీశ్వర్, ఇడి సత్యనారాయణ, డిటి ప్రభాకర్ శర్మ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చెప్పిన సూచనలు, వెలిబుచ్చిన అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.

★ హైదరాబాద్ జనాభా ప్రస్తుతం కోటి. దాదాపు 10 లక్షల జనాభా నగరానికి రోజు వచ్చి పోతుంటారు. వీరందరికి ప్రతిరోజు మంచినీళ్లు తాపించాలి. సాధారణంగా ఏడాదికి 10 లక్షల చొప్పున నగర జనాభా పెరుగుతున్నది. ఐటిఐఆర్ ప్రాజెక్టు, పారిశ్రామిక విధానం కారణంగా నగరంలో జనాభా చాలా పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాలు కూడా తీరేలా మంచినీటి సరఫరా వ్యవస్థను రూపొందించుకోవాలి. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలి.

★ హైదరాబాద్‌లోని జనాభాతో పాటు పరిశ్రమలు, హోటళ్లు, ఆసుపత్రులు, రైల్వేలు, విద్యా సంస్థలు, ఎయిర్‌పోర్టు తదితర సంస్థలకు కూడా మంచినీరు అవసరం. ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

★ ప్రస్తుతం కృష్ణా ద్వారా 11 టిఎంసిలు, సింగూర్ ద్వారా 7 టిఎంసిలు, గండిపేట, హిమాయత్‌సాగర్ ద్వారా రెండు టిఎంసిల నీటిని హైదరాబాద్ కోసం ఉపయోగిస్తున్నాం. ఈ 20 టిఎంసిల నీరు ప్రస్తుత అవసరాలను పూర్తిగా తీర్చలేక పోతున్నది. దాదాపు 35 టిఎంసిల నీరు నగరానికి అవసరం.

ఎక్కడి నుండి నీళ్లు హైదరాబాద్‌కు తరలించడం మంచిది? అందుకు అవలంభించాల్సిన పద్ధతులు ఏమిటి? తదితర అంశాలపై అధ్యయనం చేయాలి.

★ ఎల్లంపల్లి నుండి గోదావరి నీటిని హైదరాబాద్‌కు తరలించే పనులను వేగవంతం చేయాలి.

★ కృష్ణా నదిలోని నీటిని కూడా శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు తరలించాలి. దీనికి సంబంధించి అధికారులు అధ్యయనం చేయాలి.

★ అవుటర్ రింగురోడ్డుకు ఆనుకుని మొత్తం నగరం చుట్టూ మంచినీళ్ల పైపులైన్ వేయాలి. దీనివల్ల ఎక్కడినుండైనా నీళ్లు తెచ్చుకోవడానికి, నగరంలోని ఏ ప్రాంతానికైనా నీరు సరఫరా చేయడానికి వీలవుతుంది. ఈ పైపులైన్ అందుబాటులోకి వస్తే అవుటర్ రింగురోడ్డు అవతల అభివృద్ధి చెందే ప్రాంతాలకు కూడా మంచినీరు సరఫరా చేయడం సులభం అవుతుంది.

★ గోదావరి, కృష్ణా ద్వారా హైదరాబాద్‌కు నీటి సరఫరా చేసే యంత్రాంగం పటిష్టంగా ఉండాలి. రెండు వైపుల నుండి నీరు తీసుకునే వెసులుబాటు చేసుకోవాలి.

★ మంచినీటి సరఫరాతో పాటు నగరంలో వర్షపు నీరు రహదారులపై నిలవకుండా ఉండేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి. జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి అధికారులు సంయుక్త సమావేశం ఏర్పాటు చేసుకోవాలి.

★ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి కి రూ. 100 కోట్లను తక్షణం విడుదల చేస్తాం.

★ వివిధ సంస్థల నుండి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బికి రావాల్సిన బకాయిలను వసూలు చేసే విషయంలో అధికారులు శ్రద్ధ చూపాలి. ప్రభుత్వం కూడా ఈ విషయంలో సహకారం అందిస్తుంది.

★ తెలంగాణ డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ ద్వారా 9 జిల్లాలకు మంచినీరు అందించడానికి పకడ్బందీ ప్రణాళికలు తయారు చేసి చర్యలు తీసుకుంటున్నట్లే హైదరాబాద్ నగర మంచినీటి సరఫరాకు కూడా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. మంచినీటి సరఫరా విషయంలో ప్రభుత్వం ఖర్చుకు వెనకాడదు.

---

సిపిఆర్ఓ టు సిఎం